క్లుప్తంగా

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కాగజ్‌నగర్‌టౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన సేవను కొనియాడారు. గ్రంథాలయాల ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి వివరించారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ సాంస్కృతిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దత్తాత్రేయ, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజు, లెక్చరర్లు డి.జనార్దన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఆనంద్‌రావు

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని నంబాలకు చెందిన రత్నం ఆనంద్‌రావు నియమితులయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పస్తం పోషం ఆనంద్‌రావుకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఘనంగా లహూజీ సాల్వే జయంతి

నార్నూర్: బడుగు, బలహీన వర్గాల ఆరాధ్యుడు లహూజీ సాల్వే 228వ జయంతిని మండలంలోని ఖంపూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

మంచిర్యాలటౌన్: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా వాసవీ క్లబ్ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నెల రోజుల నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు దాత ముస్త్యాల శ్రీనివాస్, అశోక్‌లను సన్మానించారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టి, నిరుపేదల ఆకలిని తీరుస్తామని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నలుమాసు ప్రవీణ్, కార్యదర్శి ఎర్రం వెంకటేశ్, కోశాధికారి చిలువేరు మహేశ్, జిల్లా గవర్నర్ కొండ చంద్రశేఖర్, కొంకుముట్టి వెంకటేశ్, కేశెట్టి వంశీకృష్ణ, గారిశెట్టి ధనలక్ష్మీ, చిలువేరు వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

వరికోత సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

చెన్నూర్‌రూరల్: వరి కోతల సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో కవిత రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆస్నాద గ్రామంలో వరి కోతలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వరికోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో సాగర్, రైతులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

జన్నారం: మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు అధ్యక్షుడు కడార్ల నర్సయ్య మంగళవారం తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా కొత్తపెల్లి అశోకాచారి, ఉపాధ్యక్షుడిగా బావండ్లపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగోజు శ్రీనివాస్, కార్యదర్శులుగా శేఖర్, శ్రీనివాస్, కోశాధికారిగా కొత్త శ్రీను, అధికార ప్రతినిధిగా దేవరకొండ నరేశ్ చారిలను నియమించినట్లు ఆయన తెలిపారు.

సఖీ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్: సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం సోషల్ కౌన్సిలర్ లావణ్య కోరారు. మండలంలోని జామిని, జున్నపాని, దత్తగూడ గ్రామాల్లో మహిళా చట్టాలు, హక్కులు, టోల్‌ఫ్రీ నంబర్లు, ప్రభుత్వ పథకాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర, నిక్లేశ్వర్, గ్రామ పటేల్ కొడప రాము, రాజు, జంగు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కైలాస్‌నగర్: పట్టణంలోని నిరాశ్రయుల ప్రయోజనార్థం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిల్కూరి లక్ష్మీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేశారు. తాంసి బస్టాండ్ పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించారు. మెప్మా డీపీఎం శ్రీనివాస్, టీఎంసీ భాగ్యలక్ష్మి, సీవోలు వై.సందీప్‌రెడ్డి, విష్ణు, ఏఎన్ఎంలు, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రవి పాల్గొన్నారు.

రైతుల సమగ్రాభివృద్ధికి కృషి

తిర్యాణి: రైతుల సమగ్రాభివృద్ధికి సహకార సంఘాలు పని చేస్తున్నాయని పీఏసీఎస్ చై ర్మన్ చుంచు శ్రీని వాస్ అన్నారు. సహకార సంస్థ వారోత్సవాల్లో భాగ ంగా మంగళవారం మ ండల కేంద్రంలో సంఘం కార్యాలయం ఎ దుట జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. వారోత్సవాల్లో భాగంగా రైతుల అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్ గణపతి, కార్యాలయం సిబ్బంది బొజ్జి రావు, పవన్ తదితరులు ఉన్నారు.



జెండాకు వందనం చేస్తున్న నాయకులు

సహకార వారోత్సవాలు ప్రారంభం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం సహకార వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రకుం ప్రహ్లాద్, డైరెక్టర్లు విజయలక్ష్మి, బాపు, దేవన్న, చంద్రశేఖర్, డీసీవో నవీన్, బ్యాంక్ సూపర్‌వైజర్ రాజేందర్, సీఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

పీపీరావు పాలనతోనే అభివృద్ధి

- సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: దివంగత నేత పాల్వాయి పురుషోత్తంరావు పాలనతోనే పేద ప్రజలకు మేలు కలిగిందని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని వీరవెల్లి, కౌఠి, సాండ్‌గాం, పార్డీ, కనికి, శీర్షా, ముత్తంపేట్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిర్పూర్ ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రజలు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నానని, కమలం గుర్తుకు ఓటు వేసి స్థానికుడైన తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు వానుపటేల్, నాయకులు రాజేందర్ గౌడ్, విజయ్, మధుకర్, చందు, మృత్యుంజయ్, కవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కనికిలో ఎన్నికల ప్రచారంలో హరీశ్‌బాబు



సాండ్‌గాంలో..

దుమ్ము, ధూళితో తిప్పలు

- ముత్తంపేట గ్రామ శివారులో స్టోన్ క్రషర్లు
- క్వారీలో బ్లాస్టింగ్‌తో లేస్తున్న దుమ్ము, ధూళి
- అనారోగ్యానికి గురవుతున్న స్థానికులు
- కంకర లారీలతో పలు ప్రమాదాలు



ముత్తంపేట వద్ద ఉన్న కంకర క్వారీ



ముత్తంపేట-పార్డి రోడ్డుపై లేస్తున్న దుమ్ము

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామ శివారులో గల స్టోన్ క్రషర్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. క్రషర్ నిర్వహణకు సంబంధించి నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నా ఇక్కడ అమలు కావడం లేదు. బూడిద, ధూళి కణాలను నిస్సిగ్గుగా జనం పైకి వదిలేస్తున్నారు. ప్రజలు ఏమైపోయినా ఫర్వాలేదన్న రీతిలో కొందరు క్రషర్ యజమానులు వ్యవహరిస్తున్నారు. పచ్చని పంటలు సైతం దుమ్ము, ధూళి కారణంగా నిస్సారంగా మారిపోతున్నాయి. కంకర క్వారీలో పేలుళ్ల కారణంగా భారీ రాళ్లు పంట చేలో వచ్చి పడడంతో దిగుబడి బాగా తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. రహదారుల నిర్మాణానికి అవసరమైన కంకరను తరలించే వాహనాలు పదుల సంఖ్యలో భారీ లోడ్‌తో వెళ్తుండడంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి.

భారీ పేలుళ్లు..

కంకర లారీలు అధిక లోడ్‌తో వేగంగా వెళ్తుండడంతో లారీల్లోని కంకర ప్రధాన రహదారులపై పడుతుంది. లారీల కారణంగా రోడ్డుపై దుమ్ము, ధూళి లేస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై కంకర రాళ్లు పడుతుండడం.. పార్డి, సాండ్‌గాం గ్రామాల రోడ్లు గుంతలమయంగా ఉండడంతో రోడ్డుపై అదుపుతప్పి పలువురు వాహనదారులు గాయాలపాలైన సంఘటనలున్నాయి. క్రషర్‌లో భారీ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బండరాళ్ల కోసం క్వారీల వద్ద భారీ గుంతలు తవ్వుతున్నారు. బండరాళ్లను తీసి గుంతలను అలాగే వదిలేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని క్వారీ యజమానులతో పాటు పరిమితికి మించి కంకర తరలిస్తున్న వాహనాలపై సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

ఆర్థికంగా నష్టపోతున్నాం

ముత్తంపేట్ శివారులో గల స్టోన్ క్వారీలకు ఆనుకొని ఉన్న నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. క్వారీల్లో భారీ బ్లాస్టింగ్ కారణంగా దుమ్ము, ధూళి పత్తి పంటపై పడి పంటల నాణ్యత, దిగుబడి తగ్గుతోంది. బ్లాస్టింగ్‌తో పాటు టిప్పర్ల రాకపోకల కారణంగా సమీప పంటలకు తీవ్ర నష్టం కలుగుతుంది. – లక్ష్మి, ముత్తంపేట్

ఓవర్ లోడ్‌తో రోడ్లు ధ్వంసం

భారీ లోడ్‌తో లారీలు వెళ్తుండడంతో మట్టి రోడ్డు ధ్వంసమవుతుంది. రోడ్డుపై గుంతల కారణంగా పార్డి, సాండ్‌గాం, కౌఠి, వీరవెల్లి గ్రామాలకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాని పరిస్థితి ఉంది. దుమ్ము, ధూళి కారణంగా శ్వాస సంబంధ వ్యాధులు సోకుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. – రాజ్‌కుమార్, పార్డి



ముత్తంపేట్ -పార్డి రోడ్డు పక్కన పత్తి పంటపై పడిన దుమ్ము

పంటలకు తీవ్ర నష్టం..

మండలంలోని ముత్తంపేట శివారు ప్రాంతంలో నాలుగు కంకర క్వారీలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చింతలమానెపల్లి మండలం గూడెం వంతెన మీదుగా మహారాష్ట్రకు, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మీదుగా ఆసిఫాబాద్‌కు నిత్యం కంకరను తరలిస్తున్నారు. 10, 12 చక్రాల లారీల్లో పరిమితికి మించి లోడ్‌ను తీసుకెళ్లే క్రమంలో సిర్పూర్(టి), కౌటాల మండలాల్లో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. రహదారులకు సమీపంలోనే నివాసాలు ఉన్నందున దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో క్వారీల్లో పేలుళ్లు జరుపుతున్నారు. సమీప పంట చేలో భారీ రాళ్లు పడడంతో ఏటా పంటలు ధ్వంసమవుతున్నాయి. కంకర లారీలు రాకపోకలతో దుమ్ము లేస్తుంది. దీంతో ముత్తంపేట్ -పార్డి రోడ్డుకిరువైపులా ఉన్న పంటలపై దుమ్ము పడి వందల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో స్థానిక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దుమ్ము, ధూళి కారణంగా అనారోగ్య సమస్యలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్టోన్ క్రషర్ల దుమ్ము, ధూళి కారణంగా శ్వాస సంబంధ వ్యాధులు సోకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న కోలాటాలు



నృత్యం చేస్తున్న మహిళలు

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ గ్రామంలో కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నేడు కోలబోడి చేయనున్న నేపథ్యంలో మంగళవారం గుస్సాడీలు అడుగులో అడుగు వేస్తూ డప్పు చప్పుళ్లతో లయబద్ధంగా చేసిన నృత్యాలు అలరించాయి. మహిళలు వివిధ రకాల గోండి పాటలపై దండారీ నృత్యాలు చేశారు. చిన్నారులు పోరీల వేషధారణతో చేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మంగళహారతులు ఇచ్చారు. నేడు కోలాబోడితో దండారీ ముగియనుంది. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, గ్రామ పెద్దలు, కటోడాలు దంబిరావు, ఆనంద్‌రావు, జలపతిరావు, సోము, శ్రీనివాస్, తుకారాం తదితరులు ఉన్నారు.

రికార్డులు నమోదు చేయాలి



సాంగ్విలో రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: అన్ని రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని సాంగ్వి, కర్వెతగూడ, పెద్దసాకడ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్, ఎండీఎం రికార్డులు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని పేర్కొన్నారు. హెచ్ఎంలకు తగు సూచనలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



పెంచికల్‌పేట్: కేజీబీవీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



తిర్యాణి: కొలంగూడ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



కెరమెరి: బహుమతులు ప్రదానం చేస్తున్న ఆడే ప్రకాశ్



వాంకిడి: బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయుడు



దహెగాం: అమరగొండ అంగన్‌వాడీ కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులు..

తిర్యాణి: మండలంలోని వివిధ పాఠశాలల్లో బాలల దినోత్సవం పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో కేక్ కట్ చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కెరమెరి: జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయా పాఠశాలల్లో ఆటలు, పాటలు, వ్యాసరచన, క్విజ్, రంగోలి, నృత్యాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

దహెగాం: మండలంలోని అమరగొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త వజ్రమ్మ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాంకిడి: మండలంలోని సరాండి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ప్రమోద్, నూతి అఖిలాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం బాలల దినోత్సవం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ సురవర్ధన్, డైరెక్టర్ జియాఉల్ హక్, మాధవి, వేద ప్రవీణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టణంలోని వయోవృద్ధుల సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు మార్త సత్యనారాయణ, కలికోట రమణయ్య తదితరులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆసిఫాబాద్‌రూరల్: బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్, ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. కాంప్లెక్స్ హెచ్ఎం విజయనిర్మల, కేజీబీవీ ఎస్‌వో శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వంకులం ప్రభుత్వ పాఠశాలలో స్వయం ప్రభుత్వ దినోత్సవాన్ని నిర్వహించారు.

కౌటాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా పాఠశాలలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మయూరి విద్యాలయం కరస్పాండెంట్ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

బెజ్జూర్: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి మండలంలోని భారత్ పెట్రోల్ బంక్ దగ్గర మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. సలుగుపల్లికి చెందిన లావుడ్య రాజేందర్ ద్వి చక్ర వాహనంపై 10లీటర్ల నాటు సారా రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. తాలయి గ్రామశివారులో 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఆర్.కిషన్, స్వాతి, సిబ్బంది కుమార్, మల్లేశ్, హుస్సేన్, స్రవంతి పాల్గొన్నారు.



నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

గుంత పూడ్చరూ...!



కెరమెరి: మండలంలోని పరంధోళి, ఉమ్రి గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై గుంత పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జూలైలో కురిసిన వర్షాల వల్ల ఏర్పడిన గుంతను ఇప్పటికీ పూడ్చకపోవడంతో ఎప్పుడు, ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గుంత పూడ్చాలని కోరుతున్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో నస్రుల్లా ఖాన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో గంటపాటు చూసి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఎంపీటీసీ నిరసన..

మండల సర్వసభ్య సమావేశం ఎన్నిసార్లు వాయిదా వేస్తారని కన్నెపల్లి ఎంపీటీసీ దుర్గం మోతిరాం ప్రశ్నించారు. కోరం లేక సర్వసభ్య సమావేశంను వాయిదా వేసినట్లు ఎంపీడీవో ప్రకటించడంతో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం కోరం లేక వాయిదా వేశారని, తిరిగి ఆరు నెలల అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాన్ని కూడా వాయిదా వేశారన్నారు. ఎంపీపీ సమావేశాలతో రాజకీయాలు చేస్తున్నారని, పాలకవర్గ సభ్యులకు సమావేశానికి రావొద్దని చెబుతున్నారని ఆరోపించారు. వారం రోజుల్లోగా సర్వసభ్య సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ మోతిరాం